
# నేతిబొట్టు

గుండం రామచంద్రారెడ్డి



ఎనిమిదినెల్ల సాంబిగాడు బండలమింద పండుకోని బోసి పండ్లతో ఇకిలిచ్చినవ్వుతా వుండాడు. వాడు నగేకొద్దీ వాల్లమ్మ మజ్జిక్కవ్వం ఇంకా బరబరా సిలకుతా వుండాది.

వాడు నగడం మానుకోలేదు.

వాల్లమ్మ సిలకడం మానుకోలేదు.

ఇంతలోనే ఓబిగాడు "అమ్మా అమ్మా! నువు సిలుకుతాంటే గాదే వాడు నగేది. వాడు నగే కొద్దీ నువ్వు ఇంగా గట్టింగ సిలుకుతాండావు. సాంబిగాడు నువ్వు సిలుకుతాన్నెప్పుడు కిందబన్నె మీగడ సుక్కలు నాక్కుంటా నగుతాండాడు" అంటా నగుతా వుండే సాంబిగాడ్ని లేపి నిల్చోబెట్టి ముద్దు పెట్టుకుంటా వుండాడు ఓబిగాడు.

మజ్జిక్కవ్వానికి కూసానికి మధ్యన వుండే తాళ్ళు తీసి కవ్వానికి కింద వుండే యన్నపూసను తీసీ, మజ్జిగ సట్టిలో వేసి ఆ వేళ్లను సాంబిగాడి నోట్లో బెట్టింది ఇంగా వేళ్ళకు యన్నపూస వుండాదని.

పండ్లు లేకున్నాగానీ వాడు ఇంగా ఇంగా నాకబట్నేడు వాళ్ళమ్మ చేతివేళ్ళను.

ఓబిగానికి పదేండ్లు. శానా లేటుగా వాల్లమ్మకు మల్లా పుట్టినాడు సాంబిగాడు. గుఱ్రప్ప సామిని కొల్చుకునింటే పుట్టినాడని పెద్దోనికి ఓబిగాడని, ఈశ్వరున్ని కొల్చుకునింటే పుట్నోడని సిన్నోనికి సాంబుడని పేరుపెట్టింది వాల్లమ్మ వీరమ్మ.

మొగుడు అప్పట్లో పస్టు ఫారం వరకూ సదుకున్నాడంట గానీ వ్యవసాయమే

చేస్తాంటాడు. మూడెకరాలు పొలం. చెరువు నిండితే పండాల.. లేకుంటే ఎండగాల్తానే వుంటాయి మడికయ్యాలు.

వీరమ్మ పాడే గనుక సేయకపోయునుంటే ఆ ఇండ్లు జరగడం శానా కష్టం. ఎప్పుడూ ఐదెనెముల పాడి. పాలు కావాల్సినోల్లకు పాలు, మజ్జిగ్గావాల్సినోల్లకు మజ్జిగ, పెరుగోల్లకు పెరుగు, నెయ్యి కావాల్సినోల్లకు నెయ్యి. ఇంటికెప్పుడూ ఎవరో ఒకరు వస్తానే వుంటారు.

వీరమ్మ భర్త నాగయ్యకు బాధ్యతలు తక్కువ. పనికూడా తక్కువే. గుడిసెకాడున్న ఒక కయ్యలో వేసిన పిల్లిపెసర రోజూ కోసుకోని రావడం,ఎనుములకెయ్యడమే. డబ్బులు, తిండిగింజలూ ఇంట్లో పెత్తనమంతా వీరమ్మదే. సన్నబిల్లోని సగతీరుతానే ఓబిగాడ్ని బడికి పంపుతానే ఐదెనుముల పాడి ఒక్కతే చేసుకుంటా వుంటాది.

పాలుపిండడం మొదలు పెట్టిందంటే బరబరా ఒక్కనిమిషంలో లీటరు పాలు చేస్తాది. లేటయిందంటే బురుగు తగ్గి కొల్త పడిపోతాదని ఆమెకు భలే ఎరుక. అందుకే పాలుకావాల్సినోల్లు బర్రెముందర నిలబడ్తేగానీ పాలుపిండడం మొదలు పెట్టదు.

ఒకరోజు బడినుంచి ఓబిగాడు ఇంటికి రాంగానే ''అమ్మా అమ్మా! మాకు సెలవలిచ్చింద్రే. దీపావళి పండగని రెండ్రోజులు సెలవ. ఇసారన్నా నెయ్యయ్యవే కాలే కాలే బువ్వలో తింటాను'' అంటా వచ్చినాడు గడ్డికి పోదామని కొడవలి లిక్కి పదును పెట్టుకుంటా వుండే వాల్లమ్మ దగ్గరికి.

''ఏందీ! ఇసారను. నెయ్యంట.. నెయ్యి.. పిల్లగాడికి. బాగుందిరా నీజోరు. యాపొద్దు తిన్నావురా నువ్వు నెయ్యి. మనింట్లో నెయ్యితింటే ఇంగ బతికినట్టే'' అంటా వీరమ్మ కసురుకుంటానే పాపం ఓబిగాడు మొకం గచ్చకాయంత చేసుకోని బుక్కుల సంచి ఆడపడేసి పైటాల సంగటి తిందామని ఇంట్లోకి పొయినాడు. మద్యానం చేసి మిగిలిన అలసంద గుగ్గుల్లకారెం, రాగి సంగటి వుంటే గబగబా ఓ ముద్దతిన్నేడు.

ఓబిగానికి పదేండ్లు వయసొచ్చిందే గానీ, ఏనాడూ గడ్డ పెరుగు తిన్లేదు. నెయ్యంటే వాసన చూడ్డమేగానీ రుచి తెలియదు. ఎవరన్నా నెయ్యికోసమని వచ్చి వీరమ్మను నెయ్యడిగితే, యన్నపూసను కాంచి దాంట్లో ఒక తమలపాకు వేసి నెయ్యంతా వాళ్ళకేసి తమలపాకుతో పాటు అడుగున మిగిలిన గసి ఓబిగాడికిస్తాది. పాపం ఓబిగాడు తమలపాకును అపురూపంగా తిని సిల్వరి గిన్నె అడుగు ఊడొచ్చేలా గసి నాకుతాడు. ఓబిగానికి పాలుపోసివ్వాలంటే వీరమ్మకు పాణం బోయినట్టే. లీటరు పాలమ్మినా ఎనిమిదిరూపాయలు వస్తాదని అనుకుంటాది వీరమ్మ.

ఒకరోజు వీరమ్మ ఊళ్ళో ఆడోళ్ళందరూ లవకుశ సిన్మాకు పోతాంటే వీరమ్మ కూడా పోయింది. ఓబిగాడు వాల్లమ్మ సిన్మాకు బోతాంటే బాగా ఏడ్సినాడు గానీ ఆమె తొడకబోలేదు. ''మెంతిపప్పు చేసి శనిక్కట్టు చారుగాంచినా. బువ్వగూడా గూట్లోనే వుంది. పెట్టు కోని తిను'' అంటా చిన్నోడు సాంబిగాడ్ని బుజానేసుకుని యలబారిపోయింది సిన్మాకు.

ఓబిగాడు చారు వుట్టిమింద బెట్టిందని చెప్పిన మతిలో బాగా కాంచిన నేతిబొట్టు వుంటే అదంతా శనిక్కట్టు చారేనని పోసుకున్నాడు. కమ్మగా వుండే కొద్దీ సుమారుగా అరపావు నెయ్యి బోసుకుని తిన్నాడు.

పేరిన నెయ్యేసుకుని తిని రాముల్దేలం కాడ సుబ్బన్న మామ కొడుకు మురళి దగ్గరకి బోయి ''మామా! మాయమ్మ శారు చేసింటే అంతా నెయ్యున్నట్టే వుండాది'' అని చెప్పేలకే మురలీగాడు పకపకా నవ్వినాడు.

''నిజంగానే మామా! మాయమ్మ శారు ఎప్పుడూ అంత రుసిగా చెయ్యలేదు'' మల్లా అన్నేడు.

మురలీగానికి చెబితే ఊరందరికీ చెప్పినట్టేననేది ఓబిగాడికి తెలియదు పాపం.

తెల్లారి వాడు రాజోల్ల వంక దగ్గర కాన్నుంచి లెవకుండా కూచోనే వుంటే అందరికీ అర్థమైంది వీడు తిన్నేది శారుగాదు.. నెయ్యని. ఒకటే బేదులు. ఏంజేసినా రాడు. ఎవరన్నా కనపడ్తే సీకిచెట్ల కిందికి జారుకుంటాడు గానీ ఇంటికి రాడు. నిక్కరేసుకునేలకే మల్లా గుడగుడా అంటా వుంటే ఏమొస్తాడు. ఓబిగాడు అమ్మల్ల పొద్దుదాంకా వంక ఇడిసింటే ఒట్టుంది!

అదే వాని జీవితంలో నెయ్యితిన్న రోజు.

* * *


With Best Compliments From:



Prabhu Enterprises

#G2, Plot #43, Opp. Paraveen High School, Rajendra Nagar, B.K. Guda, Hyderabad - 18.

Ph: 040 - 23151285, Mobile: 9885535577

ఐదెనుముల పాడి తగ్గితే వీరమ్మకు నిద్దర పట్టదు. ఇప్పుడేం తక్కవ కాదు. పుట్టింటోల్లు తోలిచ్చిన పళ్ళపడ్డ పొద్దన ఐదు లీటర్లు తక్కువేమీ ఇయ్యదు. ఇంట పుట్టిన రెండెనుములు మూడు మూడు లీటర్లిస్తాయి. ఓబిగాడు పుట్నెప్పటికంటే ముందునుంచే ఆ ఇంట్లో గాలికుంటు పోసిన సొట్టకాల్ల ఎనుముండాది. పదీతల ఎనుమైనా అది మూడులీటర్ల పాలిస్తాది. ఈ సొట్టకాల్ల ఎనుము తరిపెనుము. అంటే మల్లా కట్టుకొచ్చి వట్టిపోయే దశలో వుండాది. ఇక కొండాయపల్లె నుంచి తెచ్చిన కొమ్ముకొట్టే అలవాటున్న నాలుగో ఈత పడ్డ కూడా నాలుగు లీటర్లు తక్కువగాకుండా ఇస్తాది.

తక్కవలో తక్కవంటే ఇంట్లో పొద్దన ఇరవై లీటర్లు, మాపిటేల పదైదు లీటర్ల పాలు తక్కువుండవు. రంజాన్ వచ్చిందంటే చాలు వీరమ్మ ఇంటి సుట్టూ సాయిబూలు గిన్నెలు తీసుకోని గుంపుగడతారు నెయ్యి కోసం. ఇక క్రిస్టమస్ వస్తే తక్కువనా. మాలోల్లంతా వస్తారు పాలు పెరుగు నెయ్యికోసమంటూ. సంకురాత్తిరి వస్తేగానీ వీరమ్మ కొంచెం నెయ్యి అత్తరాసల్లో పోస్తాది. అంతకు తప్ప ఇంట్లో ఎప్పుడూ నెయ్యి మొకం ఎవరికీ సూపియ్యదు.. వీరమ్మ ఎవరి సొమ్మూ ఆశించదు, ఎవరికీ తన సొమ్ము ఇయ్యదు. మాటంటే మాటే. పరువుగల్ల మనిషి.

* * *

పొద్దనే పిల్లిపెసర కోయడానికని వీరమ్మ బోతే, తొమ్మిది గంట్లకు ఆ గడ్డిమోపును తీసుకోని రావడానికి నాగయ్య పాయినాడు. మోసేటంత మోపుకట్టి సైకెల్లో పెట్టుకుని ఇంటికెలబారినాడు.

పిల్లిపెసర కయ్యకాడ్నే వీరమ్మ బాగా బొగ్గు నమిలి పండ్లు తెల్లగా తోమి, ఆయిలింజను ఆడతా వుంటే ఆడనే శుబ్బరంగా మొకం కడ్డుక్కోని వస్తాది నాగయ్యను సాగనంపి.

నాగయ్య సైకెల్లో గడ్డిమోపు బెట్టుకోని ఇంటికొచ్చేలకే వల్లంతా సెమటలు బట్టినయి. సొక్కా అంతా తడిసిపోయింది. లుంగీకి కూడా తేమబట్టింది. గడ్డిమోపు ఆడ బడేసి యాపసెట్టుకింద నులకమంచంలో కూకున్నేడు రోంచేపుంటే సెమట ఆరిపోతాదని.

ఓబిగాడికి బడి సెలవ. వానికి సెలవంటే బరిగొడ్లను తోలకపోవాల్సిందే. వయసు పెరిగే కొద్దీ వానికి ఉగా వచ్చేసింది. ఆలోసెన చేస్తా వుండాడు ఇంట్లో ఏమన్నా జరిగితే.

వానికి ఎక్కడా లేని సందేహమొచ్చింది ఆ పొద్దుకాడ. వాల్లమ్మంటే భయం. అందుకే యాపసెట్టుకింద వుండే వాల్ల నాయన్ను "నాయనా నాయనా! మనింట్లో పాలుండాయి, పెరుగుండాది. నెయ్యుండాది ఎందుకెయ్యదు నాయనా మాకు. అందురూ కొనుక్కోని వేసుకుంటా వుంటే మనం ఇంట్లో వుండేదాన్ని వేసుకోకూడదా" అని అడిగినాడు.

నాగయ్యకు మతిపోయినట్టయింది. ఏం జెప్పాల్నో అర్థం కాలేదు. అట్నే రొండునిమిషాలు ఆలోశన జేసి "ఆ.. మీయమ్మ అంతేలేరా" అంటా సమాధానాన్ని దాటేసేదానికి నాగయ్య ప్రయత్నం జేసినాడు.

ఓబిగాడు వినడం లేదు. "మాయమ్మ సెడ్డదా నాయనా. లాకుంటే ఎందుకెయ్యదు మాకు పాలు పెరుగు నెయ్యి" అని పట్టుబట్టినాడు.

ఇంతలోనే వీరమ్మ సేన్లోనుంచి ఇంటికొచ్చింది. వాల్లమ్మను చూసి గబగబా బర్రెలను తలుగులను తప్పించి వాటినదిలిచ్చుకోని మరువగుమ్మ దిక్కు ఎల్లబారిపాయినాడు ఓబిగాడు.

నాగయ్య ఆలోచనల్లో పడ్డాడు. ఇది మూర్ఖురాలు. ఎంత చెప్పినా వినదు. వాడేమో వయసు పెరిగే కొద్దీ చిన్నదాండ్లనే పెద్ద విషయాలుగా సూపిస్తా వుండాడు. ఇడసమంటే పాముక్కోపం.. కర్నమంటే కప్పక్కోపం. అయినా మనపిల్లోల్లకు మనం బెట్టకపోతే ఎవరు బెడతారు? రేపు సాంబిగాడు కూడా పెద్దోనిమాదిరే అడుగుతాడేమో... ఇలా ఆలోచిస్తానే వుండాడు నాగయ్య. ఏమైనా సరే పిలగాల్లున్నప్పుడే దాన్నడగాలి. ఏం జెబుతాదో సూడాలి.. అనుకుంటా వుండంగలోనే వీరమ్మ మాటకు సివుక్కున లేసి సద్ది దినడానికని ఇంట్లోకి వచ్చినాడు.

* * *

మద్యానం బాగా ఎండజాము. ఓబిగాడు ఎనుములన్నిటికీ సించెరువు వంకలో బాగా పైకడుక్కోని వచ్చినాడు. బడికి పోతాండడనే మాటే గానీ వానికి ఎనుములూ, కోల్లూ, ఆవుదూల్లూ, వాల్ల నాయనతో నులక మంచాలల్లడం పనులన్నీ నేర్చుకున్నాడు.


ఎండజామున ఇంటికి ఎనుముల్ను తోలుకొని అన్నిటికీ తలుగులు పెట్టి దూల్లకు ముల్లుల చిక్కెం తీసి వాటికీ తలుగు పెట్టినాడు. ఇంటికొచ్చాలకు వాల్లమ్మ రాగెసంగటి చేసి అనపగింజల పులుసుపోసింది. వచ్చి పల్లెంముందు కూర్చుంటానే నాగయ్య మాట బైటకొచ్చింది.

"ఏమే! మనింట్లో పాడి వుంది. మనమే మన పిల్లోలకు పాలు నెయ్యి బెట్టకుంటే ఎవరు పెడతారు? పెద్దోడికి అడిగే ఉగా వచ్చింది. అయినా కుమ్మరోనికి కుండ కరువు, సాకలోడికి గుడ్డకరువు" అంటా తలకాయ కిందికి దించుకున్నాడు నాగయ్య.

వీరమ్మ రయ్యిమని లేసింది. "మీరు బాగానే సెబుతారు. మా తాత ముత్తాతల కాలం నుంచి మనూర్లో ఆచారి వుండాడు. పిల్లలు పెద్దోల్లయినారు. సంతానం పిల్లలకోడి అయినట్టు అయినాది. పిల్లకాన్నుంచీ పెద్దదాంకా నీసు లేందే ముద్ద దిగదు. వారానికి ఒక్కసారన్నా కోన్ని కొయ్యాల్సిందే. వాల్లింట్లో కోల్లు గుడ్లు పెట్టాల్సిందే గానీ పొదిగిన పాపాన పోలేదు. ఒక్క కోన్నైన్నా గంపలో పొదిగేస్తాండారా. గుడ్లన్నీ తినేది. కోడి ముక్కులో ఈక చెక్కి నీళ్ల ముంచి మల్లా తొక్కిల్లకొచ్చేట్టు చేస్తా వుంటారు. అది పిల్లల్ను చేసే దెప్పుడు. పోనీ ఇన్ని చేస్తా వుండారు. వాల్లింట్లో చూస్తామంటే ఇడిసిన గుడ్డలేసుకునే దానిక్కూడా ఒక సెక్కపెట్టె కూడా లేదు. వూరందరికీ మడకలు మాకులు తయారు చేస్తాడు. తనింట్లో చూడబోతే గూల్లల్లో గుడ్డలేసుకోవాల్సిందే దరిద్దరంగా.

సాకలి సుబ్బులు-నారిగాడు మనూర్లో గుడ్డలు తక బట్టి ఎన్నాల్లయింది. ముప్పయ్యేండ్లనుంచీ మనూరంతా మిరాసి తీసుకోని ఉతకుతా వుండారు. ఇంతమంది పిల్లోల్ల గుడ్డలు ఉతకడాని కేస్తా వుంటాము. ఆ గుడ్డలు వాల్ల పిల్లోలకెయ్యచ్చు గదా ఒక ఉతుకులోనన్నా. ఏమంటామోనని భయం. ఎప్పుడు గుద్దమింద అచ్చర్లు వున్న గుడ్డలే వేసుంటారు. ఎన్ని గింజలొచ్చినా వాల్లకు గుడ్డల శని పోలే.

నేను చిన్నప్పటినుంచీ గిలక బాయికి కుమ్మరోల్ల వెంకటమ్మ నీల్లకొస్తానే వుంది. ఇంటిచుట్టూ గోల కొండ కోటకట్టినట్టు కుండలు పెట్టుకోనుంటారు గానీ, నీల్లకు మాత్రం ఓటుబోయిన కుండనే తీసు



కొస్తాది. యాడన్నా సుంచు తగిలి తలకాయకు చెండుకట్టినట్టు కుండ సుట్టూ సింతపండు బెట్టినవే కనపడ్తా వుంటాయి. ఏమి వెంగటమ్మా మంచికుండల్లేవా అంటే.. ఏముంది లేమ్మా కొత్తకుండ తీసుకుంటే మాత్తరం ఓటుబోదా అంటా వెంగటమ్మ నీల్లుకారే కుండతోనే నీల్లు మోసుకుంటా వుంటాది.

పాడి వున్నెంత మాత్రం ఎప్పుడూ నేతులు తాగి మూతులు తుడుసుకుంటా వుంటామా. మనమెంత మన బతుకులెంత. నాలుగేండ్లయ్యింది మన సెరువు నిండక. తిండిగింజలు యాన్నుంచి వస్తాండాయి. మూడుపూట్ల కడుపునిండా తింటావుండామంటే పాడే గదా. మంచమున్నెంతలోనే కాల్లు జాంపుకోవాల. లాకుంటే మోకాల్ల నొప్పులు లేసేటప్పుడు కూచ్చుండేటప్పుడు పాణం బొయ్యేట్టు జేస్తయి'' అంటూ నాగయ్యను, ఓబిగాడికి గంటన్నర సేపు మాట్లాడకుండా జెప్పింది.

సంగటి ముద్దలు నోట్లోకి జారుకుంటా వుండంగనే నాగయ్య చేతులు కడిగినాడు.

ఓబిగాడు కూడా చేతులకయిన అనపగింజల పులుసు నాక్కుంటా దొడ్లోకి బొయినాడు సేతులు కడుక్కోడానికి. మాయమ్మ నిజ్జంగా సెడ్డదే. మా నాయనే మంచోడు. ఏదడిగినా లేదనడు. మాయమ్మకు మామింద ఎందుక్కోపమో తెలియడం లేదు. పాపం సాంబిగాడు కూడా పాలు పెరుగు తిన్లేడు. నాకు నేతి తమలపాకులన్నా ఇచ్చింది అయికూడా వానికుంటాయో లేదో పాపం అనుకుంటా వీధిలో పిల్లోల్ల దగ్గరికెల్లిపోయినాడు ఆడుకోడానికి.

* * *

వీరమ్మంటే యిక్రమార్కురాలు వూరందరికీ. మొగదిక్కునాపు జేసుకోని ఇద్దరి పిల్లోలను సదివిచ్చింది. పెద్దోడు డిగ్రీకొచ్చినాడు. పైసా అప్పుజెయ్యలె. తూమెడు గింజలు పండలా. వల్లొంచి పని జేసే సంపాదిచ్చుకున్నేది. వీరమ్మ మొగరాయుడు. ఊర్లో ఎవర్నడిగినా ఇదేమాటే.

వీరమ్మను ఎవరెంత పొగిడినా పొంగిపోయేది కాదు. తిడ్తే పడేది కాదు. తన పని తాను చేసుకోవడమే. భూకంపమొచ్చినా తన పని ఆగదు. అయితే ఎప్పుడూ కాలమొకటే మాదిరి వుండదు. వీరమ్మకు వయసొచ్చే కొద్దీ పాడి కష్టమైపోతా వుండాది. పాడెనుములను తగ్గిచ్చుకునింది. ఐదెనుముల పాడి రొండెనుములకొచ్చింది. అదయినా పిల్లోల్లు ఏదన్నా నిలదొక్కుకుండే దాంకానే.. ఆమె ఆలోచన చేసేది రోజూ ఇదే.

ఆరోజు సోమారం. రాత్తిరి పట్నం నుంచి ఓబయ్య ఇంటికొచ్చినాడు. సాంబిగాడు ఊర్లోబడే. నాగయ్య ఎటూబోలే. అందరినీ ఆలకూడేలా జేసింది.

''ఓబయ్యా! నేను సెడ్డదాన్నిరా. పాడి వున్నెప్పుడే మీకు పాలుపొయలేదు. గడ్డపెరుగున్నప్పుడే మీకు నీల్ల మజ్జిగ బోసినా. కాంచుతా వుంటే ఇండ్లంతా వాసన చూడాల్సిందేగానీ మీకు నెయ్యి మూతికి బుయ్యలే. అవున్రా నేను నిజంగా సెడ్డదాన్నే. వూర్లో రైతులందరికీ ఇంటికి యాభైవేలకు అప్పు మించే వుండాది. నేను పదిరూపాయలు కూడా అప్పుజెయ్యలేదు. ఇదో పదేండ్లనుంచి పోస్టాపీసులో కట్టిన ఆర్డీ అయిపోయింది. ముప్పయివేలు సేతికొస్తాది. ఎప్పుడూ మన బాగుగోరే రవణారెడ్డి సారు దగ్గర నువు బుట్నెప్పుట్నుంచీ ఎల్ఐసి కడతా వుండా. బాండు తీరిపోయింది. ఇప్పుడు లక్ష రూపాయల దాంకా వస్తాది. నువ్వు నీ తమ్ముడు నిలదొక్కుకుండేదాకా ఈ రూపాయలు వాడుకోండి'' అంటూ ఓబయ్య చేతులో పత్రాలు బెట్టింది.

నాగయ్యకు నోట మాట రాలేదు. సిన్నోడు సాంబిగాడు కూడా చూస్తానే వుండాడు గానీ నోరు మెదపలేదు. ఓబయ్య కండ్లమటీ జలజలా నీల్లు రాల్తానే వుండాయి. అమ్మ దగ్గరికి బొయి గట్టిగా కౌగిలించుకున్నాడు.

పైటకొంగుతో ఓబిగాని కండ్లమ్మడి కారుతున్న నీల్లను తుడుస్తా వుంటే సిన్నోడు సాంబిగాడూ అమ్మదగ్గరికొచ్చినాడు. వాని గుడ్లమింద గూడా నీల్లుబుకుతా వుండాయి.

నాగయ్య వంచుకున్నె తల ఎత్తనే లేదు. అమ్మనొదిలి ఓబిగాడు నాయనకాడికొచ్చినాడు. ''నాయనా! మాయమ్మ సెడ్డది గాదు నాయనా. శానా మంచిది'' అంటా నాయన్ను కూడా గట్టిగా అదిమి పట్టుకున్నాడు!


*With Best Compliments from...*

SSG

**Siva Sai Graphics**

6-2-985, IInd Floor, Yousuf Building
Adj. Railway Gate, Khairatabad
Hyd - 500 004. Ph : 040 - 23308772
Cell : 98490 07378
Email : sivasaiprinters@sancharnet.in
sivasaigraphics@yahoo.com